సాక్షి కర్నూలు

శనివారం ● 24 ● ఫిబ్రవరి ● 2024



విస్తరాకుల విరాళం

శ్రీశైలం టెంపుల్: చీరాలకు చెందిన భ్రమరాంబికా సేవా సమితి వారు శుక్రవారం అన్నప్రసాద వితరణ విభాగానికి రూ. 3 లక్షల విలువైన లక్ష విస్తరాకులను విరాళంగా అందజేశారు.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో ఉత్సవమూర్తులను ఉంచి సహస్ర నామ పూజలు జరిపించారు.



ట్రిపుల్‌ఐటీలో సొలస్టా ఫెస్ట్

కర్నూలు (సిటీ): జగన్నాథగట్టులోని ట్రిపుల్‌ఐటీలో వార్షిక సాంస్కృతిక సాంకేతిక ఉత్సవం (సొలస్టా ఫెస్ట్) శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు వేడుక కొనసాగనుంది.

న్యూస్‌రీల్

రికవరీలపై ప్రత్యేక దృష్టి

● డీసీసీబీ నూతన సీఈఓ విజయకుమార్



నూతన సీఈఓ విజయకుమార్‌ను అభినందిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా సహకార కేంద్రబ్యాంకును లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకుంటామని నూతన కార్యనిర్వహణ అధికారి(సీఈఓ) విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం సమర్పించారు. నూతన సీఈఓను జీఎం పి.రామాంజనేయులు, సెలవుల్లో వెళ్తున్న సీఈఓ శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, ఏజీఎం త్రినాథ్ రెడ్డి, చీఫ్ మేనేజర్ రాఘవేంద్ర, జిల్లా ఫ్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ మేనేజర్ నహిదా సుల్తాన అభినందించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కర్నూలు(అర్బన్): ఎన్నికల నియమావళిపై స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ బృందాలకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ జీ సోమశేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, జిల్లా ఆడిట్ అధికారి రమేష్‌కుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, జిల్లా ట్రైనీ డీబీసీడబ్ల్యూఓ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు ఎన్నికల నియమావళిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. సీ విజిల్ యాప్‌కు ఏవైనా ఫిర్యాదులు వస్తే 90 నిమిషాల్లోపు స్పందించాల్సి ఉందన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు బస్సు సౌకర్యం

కర్నూలు (సిటీ): ఈనెల 25వ తేదీన గ్రూప్-2 పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థుల సౌకర్యార్థం బస్సులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులను జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని వివిధ డిపో మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయంలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, అభ్యర్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. డిపోల్లో అందుబాటులో ఉండే బస్సులను పరీక్ష సమయానికి తిప్పాలని సూచించారు.

వాము క్వింటా రూ. 29,012

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వాము క్వింటా గరిష్ట ధర రూ.29,012 పలికింది. దాదాపు 1517 క్వింటాళ్లు వాము రాగా.. క్వింటాకు కనిష్ట ధర రూ.1,517, సగటు ధర రూ.2,1970 ప్రకారం లభించింది. కందులు 464 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,009, గరిష్ట ధర రూ.10,016, సగటు ధర రూ.9939 లభించింది. మినుములు 91 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.8,909, గరిష్ట ధర రూ.9299 లభించింది. ఎండుమిర్చి 899 క్వింటాళ్లు రాగా..గరిష్ట ధర రూ.23,299 పలికింది.

విద్యుత్ చౌర్యంపై కొరడా

కర్నూలు (అగ్రికల్చర్): విద్యుత్ చౌర్యంపై కొరడా ఝళిపిస్తున్నట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఎస్ఈ శ్రీనివాస బాబు తెలిపారు శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు, కందనాతి, హెచ్.కైరవాడి, కోడుమూరు, కలుగొట్ల, వేముగోడు, నాగలాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. 32 సర్వీసులపై విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసి రూ.57 వేలు జరిమానా విధించామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (సిటీ): ప్రభుత్వ బీఈడీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి గలవారు వచ్చే నెల 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ఆదినారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్యుకేషన్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఎంఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతానికి పైగా మార్కులతో పూర్తి చేసి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9949301100 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గుడ్డు ఉడికింది.. బిర్యానీ అదిరింది



చికెన్ కర్రీ

రైతా

చికెన్ బిర్యానీ

- హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం
- ప్రతి రోజు ఉదయమే పాలు
- వారంలో ఆరు రకాల అల్పాహారం, మూడు సార్లు చికెన్,
- ప్రతి రోజు మల్టీ విటమిన్ చిక్కీలు, ఒక పండు
- సాయంత్రం సేమ్యా పాయసం, ఉడికించిన పల్లీలు, మరమరాలు
- మెనూ ప్రకారం అరటి పండు, గుడ్లు
- ప్రతి విద్యార్థికి నెలకు రూ.150 నుంచి రూ.200 పెంచిన రాష్ట్ర ప్రభుత్వం



తెర్నేకల్ బీసీ బాలుర వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

కర్నూలు(అర్బన్): ఇడ్లీ, పూరి, పులిహోర, జీరా రైస్, రవ్వ ఉప్మా, పొంగల్ ... ఇవన్నీ ఏదో ఒక హోటల్‌లో మెనూ అనుకుంటే పప్పులో కాలేసినట్లే! చికెన్ బిర్యానీ, రైతా, గోంగూర చట్నీ ... ఇది కూడా నాన్ వెజ్ హోటల్ మెనూ కాదండీ! ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు వండి పెడుతున్న ఆహారం. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మెనూ విషయంలో ప్రత్యేక దృష్టి సారించింది. భోజనంలో పలు మార్పులు తీసుకువచ్చిన ప్రభుత్వం ప్రతి రోజూ ఉదయం పాలు, మల్టీ విటమిన్ చిక్కీలు, సాయంత్రం సమయంలో సేమ్యా పాయసం, ఉడికించిన పల్లీలు, రాగి లడ్డూ, మరమరాలు, రవ్వ కేసరిని అందిస్తోంది. ఇందుకు అనుగుణంగా టీడీపీ హయాంలో ఉన్న డైట్ చార్జీలను కూడా పెంచింది. ప్రస్తుతం గతంతో పోలిస్తే ప్రతి విద్యార్థికి నెలకు రూ.150 నుంచి రూ.200 వరకు ప్రభుత్వం పెంచింది. టీడీపీ హయాంలో... ప్రభుత్వ హాస్టళ్లు అంటేనే ... ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు ... ప్రస్తుతం ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు రకరకాలైన వంటకాలు. ఉదయం 7 గంటలకు పాలు, టిఫిన్‌కు పూరి, పులిహోర, ఇడ్లీ, ఉప్మా, పొంగలి తదితర వాటిని వడ్డిస్తుండగా, రాత్రి ప్రతి రోజు ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు, అన్నం, ఆకుకూర పప్పు, సాంబారు, పల్లీల చట్నీ, సాయంత్రం స్నాక్స్‌గా వేరుశనగ చిక్కీలు ఇలా ... ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్రంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇవన్నీ కాక, ప్రతి ఆదివారం మధ్యాహ్నం విధిగా చికెన్ బిర్యానీ పెడుతున్నారు. గతంలో వారంలో రెండు పర్యాయాలు మాత్రమే చికెన్ పెట్టే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం వారంలో మూడు సార్లు (ఆది, మంగళ, శుక్రవారాల్లో) చికెన్ పెడుతున్నారు. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 20వ తేదిన మెస్ చార్జీలను పెంచుతు జీఓఎంఎస్ నెంబర్: 8 జారీ చేసింది. మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచింది. పెరిగిన మెస్‌చార్జీలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెనూను పక్కాగా అమలు చేస్తుండడం వల్ల విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రతి రోజు విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను ఏ పూటకాపూట ఫోటోలు తీసి జిల్లాలోని సంక్షేమ శాఖలకు చెందిన అధికారులతో పాటు రాష్ట్ర స్థాయిలోని అధికారులకు అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల వివరాలు		బీసీ సంక్షేమ వసతి గృహాల వివరాలు
29	మొత్తం ప్రీమెట్రిక్ హాస్టళ్లు	31
4,300	మంజూరైన విద్యార్థుల సంఖ్య	6030
2687 పైగా	ప్రవేశం పొందిన విద్యార్థుల సంఖ్య	4969 పైగా
08	పోస్టు మెట్రిక్ హాస్టళ్లు	16
800	మంజూరైన విద్యార్థుల సంఖ్య	1600
589 పైగా	ప్రవేశం పొందిన వారి సంఖ్య	1462 పైగా

డైట్ చార్జీలను పెంచిన రాష్ట్ర ప్రభుత్వం ...

తరగతి	టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
3 నుంచి 4వ తరగతి	రూ.1000	రూ.1150
5 నుంచి 10వ తరగతి	రూ.1250	రూ.1400
ఇంటర్మీడియట్ ఆపై	రూ.1400	రూ.1600
కాస్మోటిక్ చార్జీలు కూడా ...		
3 నుంచి 6వ తరగతి (బాలురు)	రూ.100	రూ.125
బాలికలు :	రూ.110	రూ.130
7 నుంచి 10వ తరగతి (బాలురు)	రూ.125	రూ.150
బాలికలు:	రూ.160	రూ.200
ఇంటర్ ఆపై (బాలురు)	రూ.155	రూ.200
బాలికలు:	రూ.160	రూ.250

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సంక్షేమ వసతి గృహాల్లో ఓ వైపు పౌష్టికాహారాన్ని అందిస్తునే మరో వైపు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతి వసతి గృహాన్ని సమీపంలోని గ్రామ/ వార్డు సచివాలయాలకు మ్యాపింగ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయా సచివాలయాల్లోని ఏఎన్ఎంలు ప్రతి వారం హాస్టల్‌కు వచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందిస్తున్నారు. అలాగే ప్రతి నెలా సమీపంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వసతి గృహాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మెనూ తప్పక పాటించాల్సిందే



ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెనూ తప్పక పాటించాల్సిందే. మెనూ అమలుకు సంబంధించి ఆకస్మిక తనిఖీలను కూడా చేస్తున్నాం. విద్యార్థుల చదువుపై పూర్తి స్థాయి దృష్టిని కేంద్రీకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

– పీ వెంకటలక్ష్మమ్మ, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి

ప్రలోభాలపై ప్రత్యేక నిఘా



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రలోభాలపై ప్రత్యేక నిఘా ఉంచామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి ఎన్నికలప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సృజన జిల్లాలోని పరిస్థితులనునాయనకు వివరించారు. కర్ణాటక, తెలంగాణాల నుంచి జిల్లాలోకి అక్రమంగా వచ్చిన 7.18 కోట్ల నగదుతోపాటు కొద్ది మొత్తంలో లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల అంశాలపై వివిధ పత్రికల్లో వచ్చిన 152 కథనాలపై విచారణ జరిపినట్లు చెప్పారు. ఓటరు జాబితా సవరణ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మిగనూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా జాతీయ రహదారుల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించామని, అయితే ఆయన విధుల్లో చేరక పోవడంతో మరొకరిని నియమించేందుకు సంబంధించిన ఫైల్ రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో పెండింగ్‌లో ఉందన్నారు. పాణ్యం శాసన సభ నియోజకవర్గానికి సంబంధించిన రెండు మండలాలు పాణ్యం, గడివేముల నంద్యాల జిల్లాలో ఉన్నందున ఎన్నికల సిబ్బందిని ఆ రెండు మండలాల నుంచి కూడా తీసుకుంటున్నామని, అందుకోసం అనుమతులు ఇవ్వాలని ఆమె కోరారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

● పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు వై.రాఘవరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ వై.రాఘవరెడ్డి

కర్నూలు సిటీ: పదో తరగతిలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు వై.రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన సిల్వర్‌జూబ్లీ కాలేజీ సమావేశ మందిరంలో జిల్లాలోని హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు డీఈఓ కె.శామ్యూల్ ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వచ్చే నెలలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావు ఉండకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. మన బడి నాడు-నేడు కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం ఏడీ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ స్కూళ్లలో గోరుముద్ద పథకం కింద నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని, ఎక్కడైనా చిన్న తప్పు జరిగినా సంబంధిత స్కూల్ హెచ్‌ఎందే బాధ్యత అన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



అన్నప్రసాద వితరణ గురించి భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ డి.పెద్దిరాజు అన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక అన్నప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించారు. అన్నదాన భవనంలోని భక్తులు వేచి వుండే గదులు, వంటశాల, భోజనశాల మొదలైన వాటిని ఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భక్తుల రద్దీకనుగుణంగా అన్నప్రసాద వితరణను నిరంతరం కొనసాగించాలన్నారు. సాధారణ భక్తులు, శివదీక్షా స్వాములు, ఉత్సవాలలో ప్రత్యేక విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే కళాకారులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నప్రసాదం పంపిణీ జరగాలన్నారు. అన్నదాన భవన హాల్‌లో కూలర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సమయంలో క్షేత్రపరిధిలో అన్నదాన కేంద్రాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు దేవస్థానం నుంచి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు.

రేనాటి వీరుడు నిత్య స్మరణీయుడు



ఎయిర్‌పోర్టు వద్ద నూతనంగా ఆవిష్కరించిన నరసింహారెడ్డి విగ్రహం



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

- ఎయిర్‌పోర్టు వద్ద నరసింహారెడ్డి, మహానేత వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ
- పాల్గొన్న మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నిత్య స్మరణీయుడని రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాంజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వద్ద కార్పొరేషన్ సోషల్ రెస్పాంద్(సీఎస్ఆర్) నిధులు రూ. కోటితో నిర్మించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దివంగత నేత వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహాలను మంత్రి బుగ్గనతో పాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. కరువు ప్రాంతమైన రాయలసీమ రైతుల నుంచి పన్ను వసూలు చేయడాన్ని నిరసిస్తూ తెల్లదొరలకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాటం చేశారన్నారు. పోరాటంలో తన ఆస్తిని పేదలకు ధారాదత్తం చేశారని కొనియాడారు. కుట్రపూరితంగా తెల్లదొరలు నరసింహారెడ్డిని హత్య చేశారని, ఆయన పోరాటం చిరస్మరణీయమైనదన్నారు. ఆ ఉద్యమకారుడి జ్ఞాపకార్థం ఎయిర్ పోర్టు ముఖద్వారం వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

మహానేత చలువతో సీమకు సాగునీరు

మహానే నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువతోనే రాయలసీమ ప్రజలకు సాగునీరు అందుతోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గోరుకల్లు, గాలేరు-నగరి ప్రాజెక్టులను నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందజేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. రైతులకు చేసిన మేలును మరిచి పోకూడదనే ఉద్దేశంతో మహానేత విగ్రహాన్ని ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమ

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గుమ్మితం తండా, పిన్నాపురం గ్రామాల మధ్య దాదాపు 3 వేల ఎకరాల్లో బహుళార్థక సోలార్ ప్రాజెక్టును నిర్మించడం సంతోషదాయకమని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రూ. 15వేల కోట్ల వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమ నెలకొల్పుతున్నట్లు తెలిపారు. ఒకే ప్రాంతంలో జల, సౌర, పవన విద్యుత్ పరిశ్రమలను నెలకొల్పడంతో రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధికమించవచ్చని అభిప్రాయపడ్డారు. మహానీయుల విగ్రహాలను స్థాపించేందుకు సహకరించిన ఎయిర్ పోర్టు అధికారులు, గ్రీన్‌కో యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాసనాయుడు, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, పాణ్యం భద్రినాథ్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి, చిత్రంలో ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెక్‌ఫెస్ట్ 2కే24 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెనకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల్లో చదువుకోలేని విద్యార్థుల కోసం ఎడెక్స్‌తో కలిసి ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతి విద్యార్థిపై దాదాపు రూ.30 వేలు ఖర్చు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇలాంటి వినూత్న కార్యక్రమాలతో విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వినూత్న కార్యక్రమాలతో ముందుకు పోతోందన్నారు. తాను ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా మూడు సంవత్సరాలు బాధ్యతలు నిర్వర్తించానన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్న, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరి ప్రసాద్‌రెడ్డి వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా మద్దమాంబ కల్యాణోత్సవం

● నేడు రథోత్సవం

మద్దికెర: మద్దమాంబ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మద్దికెర గ్రామంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూల విరాట్‌కు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కల్యాణోత్సవం జరిపారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తేరుబజారులో ఊరేగించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహా మంగళహారతుల అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహా ద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధరమండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, గంగాసదనం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. బయలు వీరభద్రస్వామి ఆలయం నుంచి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంది. అక్కడి నుంచి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు అక్కడి నుంచి మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగిసింది.

నేడు ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం

కర్నూలు(సెంట్రల్): ఉప లోకాయుక్తగా పగిడి రజని శనివారం ఉదయం 11 గంటలకు లోకాయుక్త కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల ఆమెను ఉప లోకాయుక్తగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె శనివారం బాధ్యతలు తీసుకోనున్నారు.

మహానంది ఉత్సవ అధికారిగా గురు ప్రసాద్

కర్నూలు కల్చరల్: శివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని మహానంది దేవస్థానం ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్‌గా దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్, యాగంటి ఉమా మహేశ్వర దేవస్థానం ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్‌గా జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. శివరాత్రి పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, వసతుల కల్పనను వీరు పర్యవేక్షిస్తారు.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధత

- జిల్లాలో 69 కేంద్రాల ఏర్పాటు
- 8 కేంద్రాలకు ప్రత్యేక రవాణా సదుపాయం
- ప్రతి కేంద్రంలో బెంచీల ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 47,412 మంది విద్యార్థులు



కర్నూలు సిటీ: ప్రాక్టికల్ పరీక్షలు పూర్తికావడంతో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. పరీక్షల నిర్వహణకు సిబ్బందిని ఎంపిక చేస్తున్నారు. అవసరమైన చోట హైస్కూల్ ఉద్యోగులను వినియోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 69 కేంద్రాలను ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల్లో సదుపాయలను సైతం సమకూర్చుతున్నారు. మొదటి సంవత్సర పరీక్షలకు 20,258 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 23,025 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కేంద్రంలో బెంచీలను ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల్లో ఎక్కడ అక్రమాలకు అస్కారం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కేంద్రంలో గది గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలను సీసీ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రం నుంచి జోనల్, రాష్ట్ర స్థాయి ఇంటర్మీడియట్ కార్యాలయం వరకు పర్యవేక్షణ చేసేందుకు లైవ్‌స్ట్రీమ్ సదుపాయాలను కల్పించారు. పరీక్షల సమయానికి పిల్లలు చేరుకునే విధంగా రవాణా సదుపాయాలను కల్పించారు. జిల్లాలో 8 కేంద్రాలకు పరీక్షలు మొదలు అయ్యే సమయానికి రవాణా సదుపాయాలు లేకపోవడంతో ఏపీ ప్రజా రవాణా సంస్థ అధికారులతో మాట్లాడి బస్సులను ఏర్పాటు చేశారు.

సమస్యాత్మకమైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలు మొత్తం 194 ఉన్నాయి. వీటిలో 157 కాలేజీలు పని చేస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 23, ఏపీ మోడల్ స్కూళ్ల కాలేజీలు 16, ఎయిడెడ్ కాలేజీలు 04, ఏపీ సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 8, ఏపీ రెసిడెన్షియల్ కాలేజీలు 02, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు 26, మహాత్మజ్యోతి రావు పూలే 1, ప్రైవేటు కాలేజీలు 77 ఉన్నాయి. ఇందులో ఐదు సమస్యాత్మకమైన కేంద్రాలుగా గుర్తించారు. ఉన్నత పాఠశాలల్లో ఐదు చోట్ల, డిగ్రీ కాలేజీల్లో 5 చోట్ల పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కరెంట్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకునేలా సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులు సూచనలు చేశారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆలూరు, పత్తికొండ, దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతంలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు అయినందుకు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. కోసిగి, చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మాల్ ప్రాక్టీస్ ఎక్కువగా జరిగిన సందర్భాలు ఉండడంతో అత్యంత సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. ఆరికెర ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నుంచి ఆలూరుకు, ఆరేకల్లు ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నుంచి బనవాసికి, ఆరేకల్లు మహాత్మజ్యోతిరావు పూలే జూనియర్ కాలేజీ నుంచి బనవాసికి, జూలకల్లుఏపీ మోడల్ స్కూల్ నుంచి గూడూరుకు, సి.బెళగల్ ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ నుంచి గూడూరుకు, నాగులదిన్నె ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి మంత్రాలయానికి, కడివెళ్ల, పెద్దకడబూరు ఏపీ మెడల్ స్కూల్ జూనియర్ కాలేజీల నుంచి ఎమ్మిగనూరులలోని కేంద్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

వాహనాల వేలంలో రూ. 2.18 లక్షల ఆదాయం

బొమ్మలసత్రం: నంద్యాల సెబ్ పోలీస్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వాహనాల వేలంలో రూ. 2.18 లక్షల ఆదాయం లభించింది. సీఐ విశ్వనాథరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు సెబ్ పోలీస్టేషన్‌లో వేలం పాట నిర్వహించామన్నారు. ఈ వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ. 2.18 లక్షల మేర ఆదాయం లభించిందని వివరించారు. ఈ కేసుల్లో పట్టుబడిన 373 లీటర్ల నాటు సారా, 60 లీటర్ల ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని ధ్వంసం చేశామని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం...

బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలో చాద్‌బాషా అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా పాణ్యం మండలం గోనవరం గ్రామంలో భాస్కర్ అనే వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

గంజాయి ముఠా అరెస్ట్

- గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడిన ఏడుగురు
- 6.5 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: జిల్లాలో మరో గంజాయి ముఠా గుట్టురట్టు అయింది. గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని శుక్రవారం గుంతకల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. గుంతకల్లులోని షికారీ కాలనీకి చెందిన నాగు, షికారి మంజుల, బుక్కరాయసముద్రం మండలం రాఘవేంద్ర కాలనీకి చెందిన నిస్సార్ అహమ్మద్, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన నరసప్ప, కోసిగి మండలం పల్లెపాడుకి చెందిన ఎర్రతోట లక్ష్మన్న, పోయింటి ఈరన్న ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయాలకు తెరలేపారు. ముఠాలోని ఎర్రతోట లక్ష్మన్న, పోయింటి ఈరన్న నుంచి షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజుల గంజాయి కొనుగోలు చేసేవారు. కిలో రూ.11వేలతో కొనుగోలు చేసి 300 ప్యాకెట్లుగా మార్చి ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 చొప్పున విక్రయాలు చేసేవారు. గుంతకల్లు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి, తదితర ప్రాంతాల్లో వీరు గంజాయి విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా వేసిన ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ శివ భాస్కరరెడ్డి పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది మూర్తి, లక్ష్మీనారాయణ, శివ, రమేష్ ప్రత్యేక బృందంగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం గుంతకల్లు షికారి కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో గంజాయి అంశం వెలుగు చూసింది. వారి నుంచి సమాచారం రాబట్టుకుని గుంతకల్లులోని ఆలూరి రోడ్డులో ఎర్రతోట లక్ష్మన్న, పోయింటి ఈరన్నను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠా అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

డిప్యూటీ తహసీల్దార్లకు స్థానచలనం

కర్నూలు (సెంట్రల్): రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 24 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సీసీఎల్ఏ రూపొందించిన మార్గదర్శకాలను అనుసరించి మూడేళ్లు, అంతకంటే ఎక్కువ ఒకే ప్రదేశంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. అందరికీ జిల్లా స్థాయిలోనే స్థానాలు కేటాయించారు. బదిలీ అయిన వారంతా వారికి కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేరు	పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన స్థానం
ఎం.సతీష్	ఓర్వకల్లు	అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే, కర్నూలు
వాహబ్	అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే, కర్నూలు	గోనెగండ్ల
ఎస్.ఐ.వీరేంద్రగౌడ్	పెద్దకడుబూరు	హొళగుంద
ఐ.శివరామ్	కర్నూలు అర్బన్	కల్లూరు
గురు రాజారావు	ఎమ్మిగనూరు	మంత్రాలయం (ఎలక్షన్ డీటీ)
గిరికుమార్ రెడ్డి	కల్లూరు	కర్నూలు అర్బన్
ఎస్.సహారా బాను	కర్నూలు రూరల్	సీఎస్ డీటీ, ఎమ్మిగనూరు
శివప్రసాద్	సీఎస్ డీటీ, ఎమ్మిగనూరు	కర్నూలు రూరల్
కె.రజనీకాంత్ రెడ్డి	ఆదోని	ఆలూరు
వై.కె.రామేశ్వరరెడ్డి	కౌతాళం	కోసిగి
లక్ష్మీనారాయణ	చిప్పగిరి	పత్తికొండ (ఎలక్షన్ డీటీ)
అజీజ్ అహమ్మద్	ఆదోని	చిప్పగిరి
లక్ష్మీరాజు	గోనెగండ్ల	ఆదోని (ఎలక్షన్ డీటీ)
కె.శేషి శేఖర్ రావు	మంత్రాలయం	ఆదోని
డి.నిజాముద్దీన్	తుగ్గలి	కౌతాళం
ఎస్.రఘువీర్	నందవరం	ఎమ్మిగనూరు (ఎలక్షన్ డీటీ)
ఎస్.విజయ కుమార్	ఆలూరు	పత్తికొండ
జె.రుద్రగౌడ్	కోసిగి	పెద్దకడుబూరు
జి.దీప	హొళగుంద	నందవరం
ఎం.సుదర్శన్	దేవనకొండ	ఓర్వకల్లు
విష్ణుప్రసాద్	పత్తికొండ	కృష్ణగిరి
బి.నాగరాజు	మద్దికెర	తుగ్గలి
పి.రవిచంద్ర	కృష్ణగిరి	దేవనకొండ (డిప్యుటేషన్, కలెక్టరేట్)
గీతా ప్రియదర్శిని	కుడా, కర్నూలు (ఆన్‌లీవ్)	మద్దికెర

బ్యాలెట్ పేపర్ వర్క్ కోసం డీటీల కేటాయింపు... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ వర్క్ కోసం ప్రత్యేకంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను కేటాయించారు. వీరు తమకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గంలో రిటర్నింగ్ ఆఫీసర్ కింద బ్యాలెట్ పేపర్ పనులను సమన్వయంతో నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో డిప్యూటీ తహసీల్దార్‌ను కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	పని చేస్తున్న ప్రదేశం	కేటాయించిన అసెంబ్లీ
కె.వినీత్	చిప్పగిరి	ఆదోని
బాలరాజు నాయక్	ఆలూరు	ఆలూరు
భీమేష్	ఆస్పరి	పత్తికొండ
సి.నాగరాజు	హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3, కర్నూలు	కర్నూలు
పెద్దయ్య	ఆదోని	మంత్రాలయం
జాకీర్ హుసేన్	కర్నూలు రూరల్	కోడుమూరు
బి.మహేష్	పెద్దకడుబూరు	ఎమ్మిగనూరు

ఆర్యవైశ్యులు ఆదర్శప్రాయులు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



జాతిపిత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: సమాజహితం కోసం అనేక సేవా కార్యక్రమా లు చేపట్టే ఆర్యవైశ్యులు అందరికీ ఆదర్శప్రాయుల ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాల ను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట్రికె హరికిషన్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో కలిసి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి బుగ్గన స్థానిక అమ్మవారిశాలలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైఎస్ఆర్‌సీపీకి చెందిన కౌన్సిలర్లతో పాతపేట, కొత్తపేట, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్‌ల మీదుగా మంత్రి పాదయాత్ర చేశారు. మంత్రి వెంట వ్యవసాయ సలహామండలి చైర్మన్‌లు చంద్రన్న యాదవ్, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, ప్యాపిలి ఎంపీపీ గోకుల్ లక్ష్మి, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, బోరా మల్లికార్జునరెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మి, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టుపసాద్, కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు తిరునాంపల్లె తిరమలరెడ్డి, పార్టీ నాయకులు దినేష్‌గౌడ్, ఆర్ఈ రాజవర్దన్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచార్ కమిటీ నివేదిక అమలు చేయాలి

- ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా అబ్దుల్ ఖదీర్



విలేకరుల సమావేశంలో మిల్లీ కౌన్సిల్ నేతలు

కర్నూలు(అర్బన్): సచార్ కమిటీ నివేదికను, జస్టిస్ రంగనాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖదీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు న్యాయవాది ఎండీ అక్రమ్, రాష్ట్ర మీడియా సెక్రటరీ షేక్ మహబూబ్‌బాషా, కోశాధికారి అబ్దుల్ రహమాన్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షాకీర్, జీఎం గౌస్, మౌలానా ఇలియాజ్ ఖస్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీలకు దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు సింగిల్ విండో సిస్టమ్, గ్రీన్ చానల్‌ను అమలు చేయాలన్నారు. మైనారిటీ కమిషన్‌కు న్యాయ పరమైన అధికారాలు కల్పించాలని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మైనారిటీ భాషల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మైనార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించి మిల్లీ కౌన్సిల్ చార్టర్ ఆఫ్ డిమాండ్లను రూపొందించి అన్ని రాజకీయ పార్టీలకు అందించామన్నారు.

సేవామార్గంలో ఎస్‌బీఐ



ఆహోబిలం దేవస్థానానికి మినీబస్సు కోసం రూ.10.95 లక్షల చెక్ అందజేస్తున్న సీజీఎం నవీన్ చంద్ర ఝా

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్ బ్యాంకు సేవా మార్గంలో ముందుకు సాగుతోందని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝా తెలిపారు. శనివారం ఆయన కర్నూలులో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆహోబిలం దేవస్థానానికి ఎస్‌బీఐ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద మినీ ఎలక్ట్రికల్ బస్సు కోసం రూ.10,95,322 చెక్‌ను అందజేశారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎక్విప్‌మెంట్ కోసం రూ.14,50,976 ఆర్థిక సహాయాన్ని ఇచ్చారు. కడపలోని యోగి వేమన యూనివర్సిటీకి బస్సు కోసం రూ.26,43,970, కర్నూలు ట్రిపుల్‌ఐటీ డీఎం టెక్నో కల్చర ల్ ఫెస్ట్‌కు రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ సీఎస్ఆర్ అమరావతి సర్కిల్ ద్వారా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ అమరావతి.. కర్నూలు నగర శివారులోని షిరిడీ సాయి వృద్ధాశ్రమానికి ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ తరుపున రూ.లక్ష విలువ చేసే ఫ్రిడ్జ్, ప్యాన్‌లు, గీజర్, కుర్చీలు పంపిణీ చేసింది. ఈ మేరకు క్లబ్ అధ్యక్షురాలు మంజూశర్మ రూ.లక్ష చెక్ అందచేశారు. కార్యక్రమాల్లో ఎస్‌బీఐ పరిపాలన కేంద్రం డీజీఎం లేఖామీనన్, చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ సమ్మె విజయవంతం



ఏపీజీబీ రీజనల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖల్లో లావాదేవీలు స్తంభించి పోయాయి. శుక్రవారం కర్నూలు జిల్లాలోని 61, నంద్యాల జిల్లాలోని 60 ఏపీజీబీ శాఖలు ఒక్కరోజు సమ్మెలో భాగంగా బంద్ పాటించాయి. ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోషియేషన్(ఏఐఆర్ఆర్‌బీఈఏ) పిలుపు మేరకు సమ్మె జరిగింది. ఈ సందర్భంగా కర్నూలులోని ఏపీజీబీ రీజినల్ కార్యాలయం ఎదుట బ్యాంకు అధికారులు, ఉద్యోగులు దర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. ఏపీజీబీ ఉద్యోగుల సమ్మెకు ఏఐబీఈఏ, సీఐటీయు, జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం, వివిధ బ్యాంకు యూనియన్‌లు మద్దతు ప్రకటించాయి. ఏఐఆర్ఆర్‌బీఈఏ సెంట్రల్ కమిటీ సభ్యుడు మంజునాథ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హనుమంతురెడ్డి మాట్లాడుతూ..దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకు(ఎన్ఆర్‌బీఐ) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి రవితేజ, ఏఐబీఈఏ జిల్లా కన్వీనర్ నాగరాజు, అధికారుల సంఘం నాయకుడు రియాజ్, జీవిత బీమా ఉద్యోగుల సంఘం నాయకుడు రఘుబాబు, సీఐటీయూ నాయకులు అంజిబాబు, కెనరాబ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు పుష్పక్, యూనియన్ బ్యాంకు నాయకులు శివకృష్ణ, మహిళా నాయకురాలు రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

దొంగనోట్ల చలామణి కేసులో నిందితులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): దొంగనోట్ల చలామణి కేసులో ఇద్దరు నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి శుక్రవారం తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2017 జనవరి నెలలో స్థానిక ఎస్పీజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో కౌంటర్‌లో నిందితులు దూదేకుల రాజు, దూదేకుల శ్రీనివాసులు రూ.100 దొంగనోట్లను చలామణి చేశారు. వెంకట మణికంఠ అనే వ్యక్తికి అనుమానం రావడంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం

- జిల్లాలో ఇప్పటి వరకు 59,805 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్
- త్వరలోనే రిజిస్ట్రేషన్ చేసిన కన్వేయన్ డీడ్‌లను ఇచ్చేందుకు చర్యలు



కర్నూలులోని సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వారి పేరిట ఆస్తులుగా మార్చే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. జిల్లాలోని 672 సచివాలయాల పరిధిలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారుల వివరాలు సేకరించి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఫిబ్రవరి 2 నుంచి ఇప్పటి వరకు 59,805 మంది లబ్ధిదారుల పేరిట ప్రభుత్వం తరఫున వీఆర్వోలు రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన పట్టాలను నాలుగైదు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 344 వైఎస్సార్ జగనన్న కాలనీలు, ఇతర ప్రదేశాల్లో 1,08,953 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అంతేగాక అందులో 40,815 మందికి ఇళ్లను నిర్మించుకోవడానికి అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు దాదాపు 16 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి ఆఖరు నాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 326 గ్రామాల్లో 76,725 మంది లబ్ధిదారుల వివరాలను సేకరించారు. మరో 19 గ్రామాల్లో వివరాల సేకరణలో అధికారులు ఉన్నారు. కాగా, సేకరించిన వివరాల్లో ఇప్పటి వరకు 59,805 ఇళ్ల పట్టాలను సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. మిగిలిన ఇళ్ల పట్టాలను ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్న జేసీ

పేదలకు ఇచ్చిన డీ పట్టాలపై సర్వ హక్కులు కల్పించేందుకు అసైన్‌మెంట్ చట్టంలో మార్పులు చేశారు. అందులో భాగంగా పదేళ్లకు డీ పట్టాలు పొందిన వారికి సర్వ హక్కులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో పేదల ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య నిత్యం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

29లోపు అన్ని పట్టాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు

పేదల ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ, వార్డు సచివాయాలయాల్లోనే రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 59,805 రిజిస్ట్రేషన్లను పూర్తి చేశాం. ఫిబ్రవరి 29లోపు అన్ని పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్ లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– నారపురెడ్డి మౌర్య, జేసీ, కర్నూలు